


రోజూలాగే శ్యామల తన గదికి వస్తుందనుకున్నాడు శంకర్రావు. తనకినచ్చిన చిన్న పువ్వులున్న ఫుల్‌వాయిల్ చీర కట్టుకుని దానికి మేచ్ అయ్యే లోనెక్ జాకెట్టు వేసుకుని - లోపల - వుహూ ఆ కంపెనీలూ, నాణ్యతలూ అన్నీ శ్యామల, వాణిజ్య విభాగంలో పనిచేసే వుద్యోగినిలా చెబుతూంటే, ఆ పైన నవ్వుతూంటే- అలా నవ్వినప్పుడు ఏర్పడ్డ చిన్న సొట్టలో పుట్టు మచ్చ మెరిస్తే తనకి లోకమే తెలియదు....స్వర్గం లేదనే వాళ్ళకి శ్యామల స్నేహం చెంపపెట్టు పెడుతుంది. బ్రతుకులో చేదు తప్ప రుచిలేదనే వాళ్ళకి, ఆమె సాన్నిత్యం పెద్ద గుణపాఠం అవుతుంది.

అయితే శ్యామలని తను...కాదు శ్యామలతో తను చాలా దూరం వెళ్ళాడు... శ్యామల లేకుండా బ్రతకలేననిపిస్తుంది. కానీ...కానీ శ్యామల లేనప్పుడు, ఒంటరిగా వున్నప్పుడు చెప్పుకోలేని బాధ వెన్నె ముకలో జివ్వున పాములా పాకుతుంది.

ఆలస్యం మరీ కాకుండా, తను వంచకుడనే బిరుదు పొందకుండా శ్యామలతో నిజం చెప్పెయ్యాలి.........

శంకర్రావు ఆ నిర్ణయానికివచ్చిన తర్వాత మంచం మీద నుంచి లేచి కూర్చున్నాడు... రోజూలాగే మంచి కాఫీ కలిపి ఫ్లాస్కులో పోశాడు....క్రీమ్ బిస్కట్లు, బ్రెడ్ సరిపడా వున్నాయో లేవో చూసుకున్నాడు...

పైకి పక్కలకూ చూస్తూంటే గోడకున్న వేంకటేశ్వరుడు కన్పించాడు...

"నీ కళ్ళముందే నానా భాగోతం నడుస్తోంది. మమ్మల్ని క్షమించు...మా తప్పులకు బాధ్యుడవి కూడా నువ్వే అను, స్వామీ" అంటూ ఓ దణ్ణం పారేశాడు.

* * * *

శ్యామల తల వంచుకుని మంచం వారగా కూర్చుంది. తలంటుకున్న ఆమె తల రేగి వుంది. ఆమెకళ్ళు బరువుగావున్నాయి. జాకెట్ విప్పేసిన మూలంగా చీరనే భుజాల మీదుగా కప్పుకుని వుంది. ఎడంకాలి బొటనవ్రేలితో నేల రాస్తోంది.

> ఒకతను: డాక్టరుగారూ మీరు చేసిన చికిత్సకు మీకు జీవితాంతం ఋణపడి వుంటాను.
>
> డాక్టరు: (ఆశ్చర్యంతో) మీకు చికిత్స చేసినట్లు నాకు జ్ఞాపకం లేదే!
>
> ఒకతను: నిజమే నాకు మీరు చికిత్స చేయలేదు మా పినతండ్రికి చికిత్స చేశారు. ఆయన ఆస్తికంతా నేనే వారసుణ్ణి.

''శంకరం... యిక లాభంలేదు....'' అంది.

''యేమిటి నీ పిచ్చి, నా మీద నమ్మకం లేదా శ్యామలా'' అన్నాడు లాలనగా శంకర్రావు..

''మన స్నేహానికి వయసు ఏడాది. యిలా మనం ఎంత కాలం ప్రేమికులుగా వుండాలి, చెప్పు...నీకేం??'' ఆగిపోయింది.

''రెండు నెలలు ఆగు...పరీక్షలు అవుతాయి...వుద్యోగం దొరికిందం టే, ఆ మర్నాడే రిజిస్ట్రారాఫీసులోబేండుమేళాలతో...

''అది కాదు, శంకరం, నేను...'' శ్యామల ఆగిపోయింది.

''యేదికాదు, బేండు మేళాలు సరిపోవా॰''

''నన్ను చెప్పనీయ్...'' శ్యామల వేసి వున్న తలుపువేపు చూస్తూ అంది.

''చెప్పు, అయితే...''

''శంకరం, నాకు నెలతప్పింది...చెప్పు.. నన్నేంచేయమంటావ్?? నూతిలో దూకమంటావా?? వురి పోసుకోమంటావా?? లేకపోతే పెళ్ళి చేసుకుంటావా, నీ యిష్టం...''

శంకరం తలలో శత సహస్ర శతఘ్నులు పేలాయి...కళ్ళలో వేయివేల మెరుపులు మిరుమిట్లు గొలిపాయి... ''శ్యామలా...'' అనగల్గాడు...అంతే...

* * * *

శంకర్రావు రెండు రోజులుగా ఆలోచిస్తున్నాడు...శ్యామలకు ఏ సమాధానం చెప్పాలా అని...

అవును...తనతో సుఖపడి తనని సుఖపెట్టమని అడగటంలో ఘోరం యేం లేదు. అది శ్యామల కనీసపు కోరిక...

కానీ శ్యామల చెప్పింది... అదే తనని రంపపుకోత కోస్తోంది...శ్యామల గర్భవతి అవడం... అదీ తన మూలంగా...

ఎలా నమ్మేది!! తన వల్ల శ్యామల గర్భం ధరించడం అసంభవం...

పదహారో యేట తండ్రీ తల్లీ తనకి బలవంతంగా పెళ్ళి చేశారు.. ఇరవై ఏళ్ళు వచ్చేసరికి యిద్దరు పిల్లలు పుట్టారు.... కానీ...మరో సంవత్సరం లోపునే భార్య పోయింది ... భార్య బతికుండగానే తను వేసక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాడు... పిల్లలు తాతగారింట్లో పెరుగుతున్నారు..

ఐదేండ్ల క్రితం జరిగిన సంఘటనలు కళ్ళముందు తిరుగుతున్నాయి...

శ్యామల తనతో నిజం చెప్పడంలేదా !¡ తను మరెవరి వల్లో మోసపోయి, ఆ పాపం తనకి అంటగట్టాలని చూస్తోందా !!

తను అన్ని విషయాలు చెప్తే శ్యామల భరించగలదా?! అవమానంతో, మరోదారి లేక ఏదైనా అఘాయిత్యం తలపెడితే...

శంకర్రావు ఓ గంట ఆలోచించి ఆపైన ఓ నిర్ణయానికి వచ్చాడు. తన జీవితం కన్నా శ్యామల బతుకు ముఖ్యం అన్పించింది....

శ్యామలకి శంకర్రావు తన మెడలో మంగళసూత్రం కడుతూంటే ఎంతో గర్వం వేసింది. ప్రేమించినందుకు చొరవ తీసుకున్నందుకు తను భంగపాటు పొందలేదు. కానీ తనకెంత భయం వేసిందని!!! శంకర్రావు ఓ అర్ధరాత్రి రూమ్ ఖాళీచేసి వెళ్ళినట్టు తను అతని జాడ తెలియక డీలాపడ్డట్టు ఆపైన హుసేన్ సాగర్‌లో దూకినట్టు కలలొస్తే యెంత భయమేసేది!? మొత్తం మీద తను జయించింది. స్నేహితురాళ్ళు పందెం కూడా కట్టారు. ''అతగాడు నిన్ను పెళ్ళి చేసోడు,దగాచేసిపోతాడు చూడు''అంటూ.

చిన్న అబద్ధం ఆడి శంకర్రావుని తను తనవాణ్ణి చేసుకుంది, నెల తప్పిందని చెప్పడం-అసలు అలా చెప్పాలనే ఊహ తనకి తట్టడం...వండర్ ఫుల్...

యిక ఫర్వాలేదు. ఓ రోజు నర్సింగ్ హోంకి వెళ్ళి-ఎబార్షన్ అయిందంటూ శంకర్రావుకి ఫోన్ చేస్తేచాలు...పైగా లేడీడాక్టర్ తన స్నేహితురాలు...ఆవిడకన్నీ తెలుసు... తెలివిగా తనని గండం నుంచి తప్పిస్తుంది. పెళ్ళికోసంకప్పుకున్న ముసుగు తీసిపోతుంది.

శ్యామల తన నిర్ణయానికి ఎంతో గర్వపడింది. టేబిల్‌మీద ఫొటోతీసి శంకర్రావుని ముద్దు పెట్టుకుంది....తీపితీపి కలలు కంది.

అందులో తను ఏదో ఒక రోజు మాతృమూర్తి అయినట్టు, శంకర్రావు తనని తెగ గేలి చేసినట్టు...అలా...అలా...

* * * *

శంకర్రావు నర్సింగ్‌హోంకి వెళ్ళేసరికి స్పెషల్ వార్డ్‌లో మంచం మీద పడుకున్న శ్యామల కనిపించింది.

శంకర్రావు కన్నీరు ఆగిందికాదు. మనసు దేవినట్టయింది. అది శ్యామలకు ఎబార్షన్ అయినందుకు కాదు.... హాస్పటల్‌కు వెళ్ళేసరికి ఎదురయిన లేడీ డాక్టర్‌ని చూసి శంకర్రావు ఆశ్చర్యపోయాడు.

ఆవిడా అంతే అయ్యింది...

ఒకళ్ళనిచూసి ఒకళ్ళు ''నువ్వా'' అనుకున్నారు ...

శంకర్రావుకి మొదటి పెళ్ళి అవడం; అతనికి పిల్లలుండడం అతను వేసక్టమీ చేయించుకోవడం అన్నీ లేడీ డాక్టర్‌కి తెలుసు.

''శ్యామల నా భార్య'' అంటూ అంతా చెప్పేసరికి లేడీ డాక్టర్‌కి కూడా నిజం చెప్పక తప్పలేదు...

శంకర్రావు మెదడులోంచి ఓ అనుమానం పోయి మరో తీరని బాధ చోటు చేసుకుంది.

''ఆడపిల్ల, ఆ పరిస్థితిలో చిన్న అబద్ధం చెప్పి తాళికట్టించుకుంది....అంతే...''

''నేను మీమాటలు నమ్మాను...కానీ...

''పరవాలేదు, చెప్పెయ్...నేను నీవెనకే వస్తాను...ఆటలో అరటి పండు... చెల్లుకి చెల్లు...''

శంకర్రావు వీపు నిమురుతూ ఒక్కొక్క మాటా చెబుతూంటే శ్యామలకు మొదటభయం ఆ పైన ఆశ్చర్యం: యింకా యింకా ఆనందం; తుదిగా తెరలు తెరలుగా నవ్వూ వచ్చాయి...

శంకర్రావు నవ్వాడు ... లేడీడాక్టర్ నవ్వింది.

''లేఅమ్మా, అలిసిపోయావు నటించి'' అంది లేడీ డాక్టర్.

''వారూ అంతేగా యిద్దరికీ అంబులెన్స తెప్పించి యింటికి పంపండి, మేడమ్...'' అంది శ్యామల. *